వేసవి కార్యాచరణ ప్రణాళికలో తీవ్ర జాప్యం


కొత్తవీధిలో వీధి కొళాయి వద్ద ఖాళీ బిందెలు

- జనవరిలోగా ప్రతిపాదనలు పంపాలి
- కానీ రెండు నెలలు ఆలస్యంగా కలెక్టర్‌కు పంపిన వైనం
- వివిధ రకాల పనులకు రూ.29.5 లక్షలు అవసరమని నివేదిక

నర్సీపట్నం, ఏప్రిల్ 1: మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం వేసవి కార్యచరణ ప్రణాళికకు రెండు, మూడు నెలల ముందుగానే జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పెడుతుంటారు. మునిసిపాలిటీలో అందుబాటులో వున్న నీటి వనరులు, బోర్లు, మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతులు, అదనపు మోటార్లు, శివారు ప్రాంతాలకు సరఫరా చేయడానికి అవసరమైన వాటర్ ట్యాంకర్లకు అయ్యే ఖర్చులకు సంబంధించి అంచనాలు తయారు చేసి ఏఎస్‌సీ గ్రాంట్ కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తారు. ఇందుకు అనుగుణంగా కలెక్టర్ నిధులు మంజూరు చేస్తారు. మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అంచనాలు తయారు చేసి డిసెంబరు నుంచి జనవరిలోగా ప్రతిపాదనలు పంపుతారు. మునిసిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విచిత్రంగా ఈ ఏడాది చాలా ఆలస్యంగా మార్చి 27న జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు.

తాగునీటి పథకాలు ఇవే..

మునిసిపాలిటీలో సుమారు 20 వేలు గృహాలు, 65 వేల జనాభా ఉన్నారు. పబ్లిక్ కుళాయిలు 1,232, వ్యక్తిగత కొళాయిలు 1,546 ఉన్నాయి. తొమ్మిది చిన్న మంచి పథకాలు ఉండగా కొన్నింటిలో ఎన్టీఆర్ సుజల పథకాలు నడుపుతున్నారు. సీబీఎం కాంపౌండ్ ఆవరణలో 1.5 లక్షలు, రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంకులు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో 2.5 లక్షలు లీటర్లు, పాత సంతబయలులో 2.5 లక్షలు, పెదబొడ్డేపల్లిలో 90 వేలు, 2 లక్షల లీటర్లు, బలిఘట్టంలో 90 వేల లీటర్ల సామర్థ్యంగల రెండు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. దుగ్గాడ, ఉత్తరవాహిని నీటి బావుల నుంచి ఈ పథకాలకు తాగునీరు పంపింగ్ చేసి ఇళ్లకు, పబ్లిక్ కొళాయిలకు సరఫరా చేస్తారు. దుగ్గాడ, ఉత్తరవాహిని వాటర్ స్కీమ్‌ల ద్వారా 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పుడు 4.06 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. రోజుకి ఒక మనిషికి 135 లీటర్లు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా 58 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు.

రూ.29.5 లక్షలతో వేసవి ప్రణాళిక

వేసవిలో తాగునీటి సరఫరాకు రెండు వాటర్ ట్యాంకర్లు అవసరమని రూ.8 లక్షలు అంచనాలతో ప్రతిపాదించారు. దుగ్గాడ ప్రాజెక్టు ఊట బావుల వద్ద నీటి నిల్వలు కోసం ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయడానికి రూ.2.3 లక్షలు, దుగ్గాడ, ఉత్తరవాహిని వద్ద రెండు బోర్లు తవ్వించడానికి రూ.5 లక్షలు, నీటి సరఫరా పైప్‌లైన్లు మరమ్మతులకు రూ.5 లక్షలు, బోర్లు నిర్వహణ సామగ్రి కొనుగోలుకు రూ.5 లక్షలు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటుకు రూ.4.2 లక్షలు అవసరమని జిల్లా కలెక్టర్‌కి ఇటీవల ప్రతిపాదనలు పంపారు.

554 కిలోల గంజాయి స్వాధీనం

- పట్టుబడిన బాలుడు, ఆరుగురు వ్యక్తులు

- వార్త 7వ పేజీలో..

టీడీపీపై వైసీపీ విషప్రచారం

- సోషల్ మీడియా వేదికగా వలంటీర్లకు వైసీపీ నాయకుల మెసేజీలు
- పింఛన్ల పంపిణీ టీడీపీ కారణంగానే ఆగిందని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని ఒత్తిడి



రోలుగుంటలో సోషల్ మీడియాలో వైసీపీ పోస్ట్ చేసిన మెసేజ్

రోలుగుంట, ఏప్రిల్ 1:

ఎన్నికల వేళ అధికార వైసీపీ దుష్ప్రచారానికి పాల్పడుతున్నది. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికార పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంది.

వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నది. "వలంటీర్లకు ముఖ్యగమనిక. టీడీపీ నాయకుల ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన ద్వారా ఇంటింటికీ అందజేసే పెన్షన్లు నిలిపివేశారు. మన అవ్వ, తాతలకు బాధ్యతగా ఇచ్చే పెన్షన్ కార్యక్రమాన్ని ఆపింది టీడీపీయేనని ప్రతీ గడపకు వెళ్లి చెప్పండి. రెండు నెలల్లో జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తుంది. ప్రతీ నెల పింఛన్ ఇస్తాం అని చెప్పాలని మనవి" అంటూ రోలుగుంట మండలంలోని వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో, వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. కాగా పింఛన్లను వలంటీర్లతో పంపిణీ చేయించొద్దంటూ టీడీపీయే ఇలా చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం రోలుగుంటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూడా ఆరోపించారు.

చెరకు రైతుపై శీతకన్ను

అసంపూర్తిగా ఆధునిక పరిశోధన కేంద్రం భవన నిర్మాణాలు

- టీడీపీ హయాంలో 2018లో రూ.3.38 కోట్ల నాబార్డు నిధులు మంజూరు
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నెమ్మదించిన పనులు
- మూడేళ్ల నుంచి పూర్తిగా ఆగిన నిర్మాణాలు
- రైతు సంఘాలు విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోని మంత్రులు
- తీవ్ర జాప్యంతో పెరిగిన నిర్మాణ వ్యయం


ఆర్ఏఆర్ఎస్‌లో నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయిన చెరకు పరిశోధన కేంద్ర భవనం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

చెరకు రైతులను వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ఈ పంట సాగుపై ఆధారపడి వేలాది మంది రైతులు జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వం ఏ మాత్రం తోడ్పాటు అందించడంలేదు. వారి కష్టనష్టాలను ఒక్క ఏడాది కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సహకార షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి రైతులను, కార్మికులను ఆదుకుంటామని 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికార పగ్గాలు చేపట్టిన తరువాత తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను దివాలా బాట పట్టించి ఒక్కటొక్కటిగా మూసివేయించారు. మరోవైపు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేయదలచిన ఆధునిక చెరకు పరిశోధన కేంద్రం (షుగర్ కేన్ మోడర్న్ రిసెర్చ్ కాంప్లెక్స్) భవన నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు.

చెరకు రైతుల విస్తృత ప్రయోజనాల కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చెరకు ఆధునిక పరిశోధన కేంద్రం భవన నిర్మాణానికి రూ.3.38 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు నత్తనడకన సాగాయి. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, చేసిన పనులకు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం కారణంగా భవనం పనులు చాలా నెమ్మదిగా జరిగాయి. కొవిడ్ ప్రబలేనాటికి సుమారు రూ.2 కోట్లు విలువైన పనులు చేశారు. శ్లాబులు వేశారు. అంతవరకు చేసిన పనులకు నాబార్డు నుంచి నిధులు విడదలయ్యాయి. కిటికీలు, తలుపులు, విద్యుద్దీకరణ, ప్లాస్టరింగ్, ప్లంబింగ్ వగైరా పనులు జరగలేదు. భవన నిర్మాణ పనులు మూడేళ్ల నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న తీరున ఉన్నాయి.

ఇద్దరు మంత్రులున్నా....

చెరకు ఆధునిక వ్యవసాయ పరిశోధన కేంద్ర భవన నిర్మాణ పనులు ఆగిపోయిన వైనంపై స్థానిక రైతు సంఘాల నేతలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు.. బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు ఎంపీ డాక్టర్ సత్యవతి దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లారు. కానీ ఒక్కరు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. మంత్రుల స్థాయిలో పలుకుబడిని ఉపయోగించి నాబార్డుపై ఒత్తిడి తెచ్చి నిధులు విడుదల చేయించివుంటే భవన నిర్మాణ పనులు పూర్తయ్యేవని రైతు సంఘాల ప్రతినిధులు అంటున్నారు. ఆధునిక చెరకు పరిశోధన కేంద్రం అందుబాటులోకి రాకపోవడంతో చెరకుపై పసుపు, ఆకుపచ్చ వంటి వైరస్ తెగుళ్ల ఉధృతి బాగా పెరిగిపోయి చెరకు దిగుబడులు గణనీయంగా పడిపోయి రైతులు నష్టపోతున్నారు. మరోవైపు నీటి ఎద్దడిని తట్టుకుని, అధిక దిగుబడి ఇచ్చే చెరకు రకాలను అభివృద్ధి చేసి రైతులకు అందించడానికి ఆధునిక చెరకు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు.

పెరిగిన నిర్మాణ వ్యయం

చెరకు ఆధునిక పరిశోధన కేంద్ర భవన నిర్మాణంలో జరుగుతున్న జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం పెరుగుతున్నది. ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గ సభ్యులు ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నాబార్డు నిధులు మంజూరు చేయకపోతే ప్రభుత్వమే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని వారు కోరారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.2.2 కోట్లు అవసరమని సబంధిత శాఖ ఇంజనీర్లు తాజాగా అంచనా వేశారు. నిర్ణీత గడువులోగా పనులు చేపట్టి వుంటే రూ.1.38 కోట్లతోనే భవనాలు అందుబాటులోకి వచ్చేవని, మూడేళ్ల నుంచి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రూ.60 లక్షలకుపైగా అదనం భారం పడుతున్నదని రైతు సంఘాల నేతలు అంటున్నారు.

ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ దోపిడీ

ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు, ట్రాక్టర్ల ద్వారా తరలింపు


మూలపర్ర సమీపంలో ఏపీఐఐసీ భూములను తవ్వేయడంతో ఇలా..


ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గొయ్యి

- నియంత్రణ అధికారులకు నెల వారీ మామూళ్లు ఇస్తున్న అక్రమార్కులు
- తాజాగా ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌పై దాడి
- పోలీసులకు ఫిర్యాదు, ఐదుగురిపై కేసు నమోదు
- తీవ్రంగా పరిగణిస్తున్న కలెక్టర్, ఎస్పీ
- ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లు సీజ్ చేసిన సీఐ

నక్కపల్లి, ఏప్రిల్ 1: విశాఖ-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు కోసం మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన భూముల్లో అక్రమార్కులు రోజూ రాత్రిపూట గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. చందనాడ, డీఎల్‌పురం, వేంపాడు, నెల్లిపూడి, అమలాపురం పంచాయతీల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ యజమానులు కారిడార్ యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. సుమారు ఏడాది నుంచి ఈ ... మిగతా 8వ పేజీలో

గోవాడ చెరకు రైతులకు బకాయిలు చెల్లింపు

- క్రషింగ్ ఆరంభం నుంచి జనవరి 14 వరకు ఇప్పటికే చెల్లింపు
- జనవరి 15 నుంచి 31వ వరకు సరఫరా అయిన చెరకుకు నేటి నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ
- 34,747 టన్నులకు రూ.2,500 చొప్పున రూ.8,68,69,000 చెల్లింపులు
- ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు వెల్లడి

చోడవరం, ఏప్రిల్ 1: గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి ఇటీవల ముసిగిన క్రషింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు దశలవారీగా బకాయిలు చెల్లిస్తామని ఎండీ వి.సన్యాసినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'చెరకు డబ్బులకు నిరీక్షణ' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో ఫ్యాక్టరీ అధికారులు స్పందించారు. గత ఏడాది క్రషింగ్ ప్రారంభమైన రోజు నుంచి ఈ ఏడాది జనవరి 14వ తేదీ వరకు సరఫరా చేసిన 34 వేల 894 టన్నుల చెరకుకు టన్నుకు రూ.2,500 చొప్పున 8 కోట్ల 72 లక్షల రూపాయలను ఇప్పటికే చెల్లించామన్నారు. రెండో విడత కింద జనవరి 15వ తేదీ నుంచి జనవరి నెలాఖరు వరకు సరఫరా చేసిన 34 వేల 747 టన్నులకు టన్నుకు రూ.2,500 చొప్పున 8 కోట్ల 68 లక్షల 69 వేల రూపాయలను మంగళవారం నుంచి చెల్లిస్తామని వెల్లడించారు. అలాగే ఫ్యాక్టరీ పరిధిలో చెరకు రైతులకు వచ్చే సీజన్‌కు ఒంటికన్ను ముచ్చు విత్తనం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని, కావలసిన రైతులు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. గత సీజన్‌లో మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా చెరకు రైతులకు ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే సీజన్‌లో చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3,151 చొప్పున ఇవ్వనున్నామని, అందువల్ల రైతులు చెరకు సాగు విస్తీర్ణం పెంచాలని ఆయన కోరారు.

ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు తెలపాలి

- ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చు
- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, హాజరైన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే పార్టీలు, అభ్యర్థులు తమ ఖర్చులను ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు తెలపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని విధిగా పాటించాలని సూచించారు.

ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు తేదీ నుంచి ఫలితాలు వెల్లడించే రోజు వరకు అయిన ఖర్చులకు ప్రత్యేక అకౌంట్ నిర్వహించి రిటర్నింగ్ అధికారి లేదా వ్యయ పరిశీలకులకు రోజువారీ నివేదిక అందించాలన్నారు. ఆలస్యమైతే సెక్షన్ 10(ఎ) ప్రకారం అభ్యర్థిత్వం కోల్పోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా విధంగా అభ్యర్థుల ఖర్చులు, స్టార్ క్యాంపెయినర్ల ఖర్చుల వివరాలు కూడా తెలపాలన్నారు. ఫలితాలు వచ్చిన 30 రోజుల్లోగా జిల్లా ఎన్నికల అధికారికి ఖర్చుల వివరాలు సమర్పించాలన్నారు. డబ్బు రూపంలో రూ.10 వేల కన్నా ఎక్కువ చెల్లింపులు జరపకూడదని, అంతకుమించితే తప్పకుండా చెక్కు ద్వారా చెల్లించాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతులకు ప్రత్యేంగా సువిధ యాప్ అందుబాటులో వుందని ఆయన చెప్పారు. వాహనాలు, సభలు, సమావేశాలు నిర్వహణ, ప్రకటనల ఖర్చులను కమిషన్ నిర్ణయించిన రేట్లను అనుసరించే లెక్కిస్తారన్నారు.

కౌంటింగ్ సెంటర్‌లో పనుల పరిశీలన

జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న భవనంలో ఓట్ల లెక్కింపు కేంద్రంలో పనులను, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

తాండవ రిజర్వాయర్‌లో బోటు బోల్తా

- మత్స్యకారుడు గల్లంతు
- మరొకరిని కాపాడిన సహచర మత్స్యకారులు

గొలుగొండ, ఏప్రిల్ 1:

తాండవ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు బోల్తా పడి ఒక మత్స్యకారుడు గల్లంతయ్యాడు. మరో వ్యక్తిని వేరే బోటులో వున్న సహచర మత్స్యకారులు రక్షించారు. దీనికి సంబంధించి ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు పోతురాజు అందించిన వివరాలిలా వున్నాయి.

మండలంలోనిమండలం సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు గరగల అప్పారావు, జన్ని పోతురాజు ఆదివారం రాత్రి పది గంటలకు రొయ్యల వేట కోసం తాండవ రిజర్వాయర్‌లో వల వేసేందుకు వెళ్లారు. కొంతదూరం వెళ్లిన తరువాత ఆకస్మికంగా బలమైన గాలులు వీచడంతో బోటు బోల్తాపడింది. అప్పారావు, పోతురాజు నీటిలో పడిపోయి కేకలు వేశారు. సమీపంలో మరో బోటుతో రొయ్యల వేట సాగిస్తున్న మత్స్యకారులు వచ్చి పోతురాజును రక్షించారు. అప్పారావు అప్పటికే నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారావు, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, రెవెన్యూ అధికారులు సోమవారం రిజర్వాయర్ వద్దకు వచ్చారు. గల్లంతైన అప్పారావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎటువంటి ఆచూకీ లభించలేదు. అప్పారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అప్పారావు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు రిజర్వాయర్ వద్ద నిరీక్షించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పలువురు నాయకులు వచ్చి పరామర్శించారు.


గరగల అప్పారావు (ఫైల్ ఫొటో)


గల్లంతైన మత్స్యకారుడి కోసం గాలిస్తున్న పోలీసులు, మత్స్యకారులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.14
సహారి (బుధ)	4.36

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య

చీడికాడ, ఏప్రిల్ 1: మండలంలోని శిరిజాం గ్రామానికి చెందిన ఓ యువకుడు కుటుంబ కల హాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ బి.నారాయణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శిరిజాం గ్రామానికి చెందిన విస్సారపు గణేశ్(19) చదువు మధ్యలో ఆపేసి ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఇది గమనించి వెంటనే కుటుంబ సభ్యులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు చెప్పారు. ఆ యువకుడి తండ్రి ముత్యాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శారదా నది పక్కన గుర్తు తెలియని మృతదేహం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 1: మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద శారదా నది పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్టు ఎస్ఐ బి.ప్రసాదరావు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ, సీఐ గఫూర్‌లతో కలిసి మృతదే హాన్ని పరిశీలించామని, క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించిందని చెప్పారు. మృతుని వయసు సుమారు 60 ఏళ్లు వుంటాయని, తెల్ల చొక్కా, పంచె ధరించి వున్నాడని, చేతికి కడియం ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 94407 96087 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్ఐ ప్రసాదరావు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 1: కాలువ దాటుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం పెదగొల్లలపాలెం రామాలయం వీధిలో కసిరెడ్డి సంతోశ్ (30) భార్య గౌరి, నాలుగు నెలల కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. అనకాపల్లి లారీ యార్డులో డ్రైవర్‌గా పని చేస్తున్న సంతోశ్ ఆదివారం ఉదయం విధులకు వెళ్లి రాత్రయినా ఇంటికి చేరలేదు. అయితే సంతోశ్ అనకాపల్లి వెళ్లి అక్కడ నుంచి ఇంటికి చేరుకునేందుకు కూర్మన్నపాలెం వచ్చాడు. ఇక్కడ రోడ్డు పక్కన ఉన్న కాలువ దాటుతుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోశ్ మృతి చెందినట్టు పోలీసుల నుంచి సమాచారం రావడంతో గౌరి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. ఆమె ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : పదో తరగతి పరీక్ష రాయడానికి ఇంటి నుంచి బయలుదేరిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. బాలిక తల్లి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ పీవీ రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కృష్ణాపురం కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని గత నెల 30వ ఒకేషనల్ పరీక్ష రాయడానికి పరీక్షా కేంద్రానికి ఇంటి నుంచి బయలుదేరింది ఆదివారం సాయంత్రం ఇంటికి చేరకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక తల్లి అమ్మాజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారుడు మృతి

వంగర, ఏప్రిల్ 1: విజయనగరం జిల్లా వంగర మండలంలోని మడ్డువలస రిజ ర్వాయర్‌లో వేటకు వెళ్లిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన మత్స్య కారుడు కొమ్మర దేవుడు(47) పటువర్ధనం సమీపంలో నాటుపడవ బోల్తాపడి మృతిచెందాడు. పటువర్ధనం గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. రిజర్వాయర్‌లోకి నాటుపడవతో సోమవారం సాయంత్రం దేవుడు వెళ్లాడు. నదిలోకి వెళ్లిన కొద్దిసేపటికే నాటుపడవ గాలులకు బోల్తాపడింది. దీంతో చేపలకు వేయడానికి సిద్ధంచేసిన వలకు చిక్కుకుని మృతి చెందాడు. వేటకు వెళ్లిన దేవుడు చీకటిపడిన వరకు రాకపోవడంతో కంగారు పడిన భార్య సూకమ్మ గ్రామంలో తోటి మత్స్యకారులకు విషయం తెలియజేసింది. దీంతో నది వద్దకు వెళ్లిన మత్స్యకారులు బోల్తాపడిన బోటు, వలకు చిక్కుకుని ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే అప్పటికే మృతిచెం దినట్లు గుర్తించారు. దేవుడు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి పొట్టపోషణకు పటువర్ధనం వచ్చాడు. ఇక్కడ మడ్డువలస రిజర్వాయర్‌లో చేపల వేట సాగించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యాంతమయ్యారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దేవుడు మృతి విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం రాజాం తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

గంజాయి కేసులో 20 సంవత్సరాల జైలుశిక్ష

ఖమ్మంలీగల్, ఏప్రిల్ 1 : గంజాయి రవాణా కేసులో నిందితులకు 20సంవత్సరాల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయి, విశాఖపట్నం రూరల్ జిల్లా నర్సీపట్నం గ్రామానికి చెందిన టి.వెంకటసత్యనారాయణ, ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన గుంజి నాగరాజు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. 2021లో ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్‌రోడ్‌లో తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను తనఖీ చేశారు. వారి నుంచి 170 కేజీల 190గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు.

ఆస్తి పన్ను వసూళ్లలో ఎలమంచిలి మునిసిపాలిటీకి 10వ స్థానం



ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, ఏప్రిల్ 1: ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో ఎలమంచిలి మునిసిపాలిటీ మెరుగైన స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలోని 127 మునిసిపాలిటీల్లో ఎలమంచిలి 10వ స్థానంలో, విశాఖ రీజియన్‌లోని 3వ స్థానంలో నిలిచిందని రెవెన్యూ విభాగం అధికారి తెలిపారు. మునిసిపాలిటీలోని మొత్తం 10,350 ఎసెస్‌మెంట్లు వుండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల 21 లక్షల రూపాయల ఆస్తి పన్ను వసూలు కావాల్సి వుంది. మార్చి 31వ తేదీనాటికి 2 కోట్ల 76 లక్షల రూపాయలు (86 శాతం) వసూలు చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోట విద్యార్థికి కాంస్య పతకం



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన దిలీప్

కశింకోట, ఏప్రిల్ 1 : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30, 31 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ స్కూలు విద్యార్థి కె.దిలీప్ అండర్-17 కేటగిరీలో 72 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకాన్ని సాధించాడని తెలిపారు. ఇతనిని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ప్రభాకరరావు, అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతు

- కూటమి పార్టీల్లో చేరడానికి క్యూ కడతారు
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- టీడీపీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం



టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని, ఆ పార్టీ నాయకులంతా కూటమి పార్టీల్లో చేరేందుకు క్యూ కడతారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి సీఎం రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కార్యాలయం వద్ద ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో టీడీపీ నాయకులంతా గత 40 ఏళ్లుగా తనకు పరిచయస్తులేనని చెప్పారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీ నాయకులు బెంబేలెత్తిపోతున్నారని, ఆ పార్టీకి చెందిన అధికారిక మీడియా కూటమిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాదని ఆరోపించారు. ఎన్నికల తరువాత వైసీపీ ఖాళీ అవుతుందని, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వారు కూడా కూటమి పార్టీల్లో చేరేందుకు క్యూ కడతారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి అధికారం ఇచ్చి, జిల్లాకు చెందిన బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్‌లకు మంత్రులుగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేయలేదన్నారు. మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్న వీరిని జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో 22 మంది ఎంపీలను గెలిపిస్తే, అభివృద్ధి పనుల గురించి సీఎం జగన్‌తో ఒక్కసారైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడంలోచ జగన్ పీజీ చేశారని, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీ అంటూ ఆయా వర్గాలను అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. అవినీతితో సంపాదించిన సొమ్మును పంచి వచ్చే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నాడని, నోటుకు ఓటును అమ్ముకొనే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, బీసీ విభాగం నాయకుడు మాదంశెట్టి నీలబాబు, ఎస్సీ విభాగం నాయకుడు సబ్బవరపు గణేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత

- విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాల్లో ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత అని, అధ్యాపకులు విద్యార్థుల వ్యవహారశైలి, మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి ఆత్మస్థైర్యాన్ని పెంచాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లాలో వివిధ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులతో ర్యాగింగ్, వివిధ రూపాల్లో జరిగే వేధింపులు, ఇతర సమస్యల నివారణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాజమాన్యాలు తల్లిదండ్రులు, విద్యార్థులతో తరచూ సమావేశాలు నిర్వహించి ర్యాగింగ్, ఇతరత్రా వేధింపు చర్యలపై చర్చించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యా సంస్థల్లో సీసీ టీవీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టెర్రస్‌పైకి, వాటర్ ట్యాంకు వద్దకు విద్యార్థులు వెళ్లకుండా కళాశాల యాజమాన్యాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ర్యాగింగ్ సంస్కృతిని నివారించేందుకు కళాశాలల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలలో స్థానిక పోలీసులను, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. ర్యాగింగ్ నిరోధానికి 112 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

554 కిలోల గంజాయి స్వాధీనం

- పట్టుబడిన బాలుడు, ఆరుగురు వ్యక్తులు
- పరారీలో మరో ముగ్గురు



పట్టుబడిన నిందితులతో ఏఎస్పీ, కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల సిబ్బంది



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, వాహనాలు

కొయ్యూరు, ఏప్రిల్ 1: మండలంలోని చీడిపాలెం గ్రామ శివారు దొడ్డవరం- కాకరపాడు ప్రధాన రహదారిలో పోలీసులు ఆదివారం సాయంత్రం 554 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, బాలుడితో పాటు ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. దీనికి సంబంధించి కొయ్యూరు సీఐ వెంకటరమణ సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

భారీగా గంజాయి తరలిస్తున్నట్టు ఆదివారం మధ్యాహ్నం కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణకు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో ఆయన మండలంలోని చీడిపాలెం గ్రామ శివారు దొడ్డవరం- కాకరపాడు ప్రధాన రహదారిలో సాయంత్రం నాలుగు గంటలకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో బూదరాళ్ల నుంచి ముందు ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక జీపుతో పాటు మరో ద్విచక్ర వాహనం రావడాన్ని పోలీసులు గమనించారు. పోలీసులను చూసి వాళ్లు తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే వారిలో ఓ బాలుడు, ఆరుగురు వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మరో ముగ్గురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారు జీకే వీధికి చెందిన బాలుడు, చింతపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన సిందేరి సుబ్బారావు, జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ కొత్తవాడ గ్రామానికి చెందిన పాంగి ప్రసాద్, వంతల శివయ్య కొర్రా గిరి, పాంగి శాలు అలియాస్ రమణతో పాటు ఇదే పంచాయతీ బూరుగుపాకలు గ్రామానికి చెందిన జీపు డ్రైవర్ కిల్లో బాలరాజుగా పోలీసులు గుర్తించారు. జీపులో ఉన్న 10 బస్తాల్లో గల 554 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని ఒడిశా రాష్ట్రం చింతలధూళి గ్రామంలో సుప్ర అనే వ్యక్తి నుంచి కిలో రూ.1200 లు చొప్పున కొనుగోలు చేసినట్టు పోలీసులకు నిందితులు తెలిపారు. ఈ గంజాయిని దిగువజనభ, చెరువూరు, కోరుకొండ మీదుగా కుడుముల వీరవరం వరకు జీపులో తరలించారు. అక్కడ నుంచి గంజాయిని కూలీలకు అప్పగించి సుర్తిపల్లి మీదుగా కొత్తవాడకు కొండ మీద నుంచి బస్తాలు కట్టి మోసుకుంటూ శనివారం రాత్రి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడకు చేరుకున్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పీనారిపాలేనికి చెందిన నొట్ల చినరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ గంజాయిని రీముల ప్రసాద్ అనే వ్యక్తి జీపులో లోడు చేయించి కిల్లో బాలరాజు జీపు డ్రైవర్‌గా, అతనికి సహాయకుడిగా వంతల శివయ్య, కొర్రా గిరితో పాటు పాంగి శాలు అలియాస్ రమణ జీపులో ఉంచి వారికి పైలెట్టుగా జీపు ముందు ఒక ద్విచక్ర వాహనంపై సిందేరి సూరిబాబు, పాంగి ప్రసాద్, పాంగి సత్తిబాబు, జీపు వెనుక మరో ద్విచక్ర వాహనంపై రీముల ప్రశాంత్, పాంగి ధర్మతో పాటు చినరామకృష్ణ బయలుదేరి జెర్రిల, ముల్లుమెట్ట, రింతాడ, పెదవలస, బూదరాళ్ల మీదుగా చీడిపాలెం, కాకరపాడు నుంచి తుని జాతీయ రహదారికి తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితుల్లో బాలుడిని జువైనల్ హోంకు, మిగతా ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. వారి నుంచి గంజాయితో పాటు జీపు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న నర్సీపట్నానికి చెందిన నొట్ల చినరామకృష్ణ, నీరుతోట పాలేనికి చెందిన పాంగి సత్తిబాబు, జెర్రిల కొత్తూరుకు చెందిన పాంగి ధర్మ కోసం గాలిస్తున్నామని ఆయన చెప్పారు. గంజాయితో పాటు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ, సిబ్బందిని ఆయన అభినందించారు.

'పోస్టల్ బ్యాలెట్‌పై ముందస్తు ఏర్పాట్లు చేయాలి'

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఎన్నికల రాష్ట్ర ముఖ్య అధికారి ముకేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.దయానిధి, ఎస్‌డీవో సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అధికార దుర్వినియోగం

- పార్కు స్థలంలో కల్యాణ మండప నిర్మాణం
- ఎన్నికల కోడ్ అమలులో ఉండగా దగ్గరుండి పర్యవేక్షణ
- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే...
- 'స్పందన'లో ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు



పార్కు స్థలంలో నిర్మాణం (అంతర్ చిత్రం) నిర్మాణ ప్రాంతంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎన్నికల సమయం అని కూడా చూడకుండా అడ్డగోలు వ్యవహారాలు నడుపుతున్నారు. ఒకవర్గం ఓట్ల కోసం ప్రభుత్వ భూమిలో కల్యాణ మంపడం నిర్మాణం చేపడుతున్నారు. దీనిని స్థానికులు ప్రశ్నించినా, లెక్క చేయకుండా దగ్గరుండి మరీ ఆదివారం శ్లాబ్ వేయించారు. ఎన్నికల సమయంలో ఇదేమి పని అంటూ అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పెందుర్తి సమీపాన చినముషిడివాడ పరిధిలో సర్వే నంబర్లు 101/పి, 102/పిలలో వుడా ఎల్‌పీ నంబరు 78/88తో పార్వతీనగర్ లేఅవుట్ వేసింది. అందులో 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి కోసం భూమి కేటాయించింది. దాని పక్కనే సామాజిక అవసరాలకు పార్కుకు స్థలం విడిచిపెట్టింది. పార్వతీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆ ప్రాంతంలో రామాలయం నిర్మాణం చేపట్టినపుడు 60 అడుగుల రహదారిని కొంత ఆక్రమించారు. దీనిపై పలువురు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు వచ్చి ఆలయ ప్రహరీపై హద్దులు మార్కింగ్ చేశారు. రోడ్డు వేసినప్పుడు ఆ ప్రహరీ తొలగించాలని ఆదేశించారు. ఇదిలావుండగా కొద్ది రోజులుగా రామాలయాన్ని ఆనుకుని ఉన్న పార్కు స్థలంలో కల్యాణ మండపం నిర్మాణం పనులు చేపడుతున్నారు. పార్కు స్థలంలో నిర్మాణం ఎలా చేపడతారంటూ చాలామంది అభ్యంతరం వ్యక్తంచేశారు. ఒక వర్గం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ని ఆశ్రయించింది. ఎన్నికల్లో తనకు అండగా ఉంటే ఆ పనిచేసి పెడతానని, తానే కల్యాణ మండపం నిర్మిస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. అన్నదే తడవుగా పునాదులు తీసి పనులు ప్రారంభించారు. గత రెండు నెలలుగా ఈ వ్యవహారం నడుస్తుండడంతో మార్చి 4వ తేదీన కొందరు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో నాలుగు అంతస్తుల కల్యాణ మండపం నిర్మిస్తున్నారంటూ అధికారులకు తెలియజేశారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఈ సమస్య పరిష్కరించాలని రిఫర్ చేశారు. మార్చి 19వ తేదీలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు వచ్చి పార్కు స్థలంలో పనులు చేపట్టకూడదని స్పష్టంచేశారు. అయితే దీని వెనుక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఉండడంతో అధికారులు నిర్మాణం జోలికి పోలేదు. ఈ నెల 4వ తేదీ వస్తే ఫిర్యాదు చేసి నెల రోజులు అవుతుంది. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇదిలావుండగా ఆదివారం (మార్చి 31వ తేదీ) ఎమ్మెల్యే అదీప్ రాజ్ అక్కడికి వచ్చి దగ్గరుండి శ్లాబ్ వేయించారు. సుమారు 45 నిమిషాలు ఆయన అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్న సమావేశం ఏర్పాటుచేయగా, అధికారులు ఏమీ చేయలేరని, తాను అంతా చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టడం, పైగా పార్కుకు కేటాయించిన స్థలాన్ని దుర్వినియోగం చేయడం ఎమ్మెల్యే స్థాయి నాయకుడికి తగునా?...అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి వ్యవహారం.. ఓటర్లను లోబరుచుకోవడం కిందకే వస్తుందని, ఆ కోణంలో దీనిపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జూన్ వరకూ ప్రత్యేక రైళ్లు

- జాబితాలో సికింద్రాబాద్, తిరుపతి, బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లు...

విశాఖపట్నం, ఏప్రిల్ 1: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను జూన్ నెలాఖరు వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రతి సోమవారం విశాఖ నుంచి సికింద్రాబాద్ నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ (08579)ను జూన్ 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08580)ను జూన్ 27వ తేదీ వరకు, ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08583)ను జూన్ 24వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం తిరుపతి నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08584)ను జూన్ 25వ తేదీ వరకు, ప్రతి ఆదివారం విశాఖ నుంచి బెంగళూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08543)ను జూన్ 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08544)ను జూలై ఒకటి వరకు, ప్రతి మంగళవారం విశాఖ నుంచి కర్నూలు సిటీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08585)ను జూన్ 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీ నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08586)ను జూన్ 26వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అనకాపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకటేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వేగి వెంకటేశ్‌ను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసినట్టు రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ తెలిపారు. విశాఖకు చెందిన వేగి బాబురావు చాలా కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారని, వెంకటేశ్ కూడా తండ్రి బాటలో నడుస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్ పనిచేస్తున్నారన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1: గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ పదవ ఏడీజే ఎస్.శ్రీవిద్య సోమవారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ కేవీ మురళీకృష్ణ విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన బూడిద మహాలక్ష్మీప్రసాద్, రాజమహేం ద్రవరం కంబాల చెరువుకు చెందిన కుందాం హేమశంకర్‌లు 2015 ఏప్రిల్ 29న పూడిమడకకు వెళ్లే బైపాస్ జంక్షన్‌లో అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 30 కిలోల గంజాయి తరలిస్తుండగా అప్పటి ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో అరెస్టు చేశారు. కోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ పదవ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

'ఏడు నియోజకవర్గాలకు బీజేపీ సమన్వయకర్తల నియామకం'

- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి



విలేకరుల సమావేశంలో శ్రీరామమూర్తి తదితరులు

చోడవరం, ఏప్రిల్ 1 : జిల్లాలోని అనకాపల్లి ఎంపీ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం నియోజకవర్గాల వారీగా బీజేపీ సమన్వయకర్తలను నియమించినట్టు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గానికి పొన్నగంటి అప్పారావు, మాడుగులకు పుట్టా గంగయ్య, పెందుర్తికి పట్టాభి, చోడవరానికి ఈర్లె శ్రీరామమూర్తి, నర్సీపట్నానికి వర్మ, పాయకరావుపేటకు రవిరాజ్, ఎలమంచిలికి రాంబాబులను సమన్వయకర్తలుగా నియమించినట్టు చెప్పారు. వీరంతా ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేనలతో కలిసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేస్తారని ఆయన వెల్లడించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బత్తుల తాతయ్యబాబు, గూనూరు మల్లునాయుడు, పెదబాబు, బొడ్డేడ గంగాధర్, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా మౌనదీక్ష


మౌనదీక్ష చేస్తున్న కొణతాల, పీలా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1: లబ్ధిదారుల ఇంటి వద్దకే పాతపద్ధతిలో పింఛన్లు పంపిణీ చేయాలని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ నోటికి నల్లరిబ్బన్ ధరించి కొణతాల గంటపాటు మౌనదీక్ష నిర్వహించారు. దీక్షకు ముందుగా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, కొణతాల మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలను సాకుగా చూపి నిలుపుదల చేయాలని చూడడం సమంజసం కాదన్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ సీఎం పేషీ అధికారులపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన 80 వైసీపీ కుటుంబాలు

సబ్బవరం, ఏప్రిల్ 1: మండలంలోని ఆరిపాకలో వైసీపీకి చెందిన 80 కుటుంబాలు ఆదివారం రాత్రి జనసేనలో చేరారు. ఇటీవల జనసేనలో చేరిన వైసీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు పిన్నంరాజు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జనసేనలో చేరిన వారందరికీ పంచకర్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వి.రామకృష్ణ, వై.మారయ్య, పీఆర్‌కె రాజు, బోకం కిశోర్, పాలిశెట్టి అర్జున, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి : గండి బాబ్జీ


గండి బాబ్జీని అభినందిస్తున్న టీడీపీ నేతలు

సబ్బవరం, ఏప్రిల్ 1 : పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు టీడీపీ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ విశాఖపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ సూచించారు. సోమవారం మొగలిపురంలో మాజీఎంపీపీ గండి దేముడు, టీడీపీ మండల మాజీఅధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు తదితరులు గండి బాబ్జీని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడును సీఎం కావడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, గండి రమణబాబు, బి.అప్పారావు, గొటివాడ సన్యాసిరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తుమ్మపాల, ఏప్రిల్ 1 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం మూలపేట, మామిడిపాలెం గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలని సూచించారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ బోర్డుకు తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. ఐదేళ్లలో 23 లక్షల మంది కార్మికులు చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 300 కోట్లు ఇతర అవసరాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్.అప్పలరాజు, కార్యదర్శి మారేడుపూడి సత్యనారాయణ, సభ్యులు చిన్ని సత్తిబాబు, గణేష్ పాల్గొన్నారు.

ఏడు నుంచి యోగా ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో జార్జిక్లబ్‌లో ఈనెల ఏడో తేదీ నుంచి నెల రోజులుపాటు యోగా ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని ట్రస్ట్ యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. అందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో జిల్లాల వారీగా మరిన్ని యోగా సెంటర్లును ఏర్పాటు చేసేందుకు ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, యోగాలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

వార్డు సచివాలయానికి పవర్ కట్

ఎలమంచిలి, ఏప్రిల్ 1 : మునిసిపాలిటీలోని అల్లూరి సీతారామరాజు కాలనీ 10వ వార్డు సచివాలయానికి విద్యుత్ అధికారులు పవర్ కట్ చేయడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. వార్డు సచివాలయం విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో అధికారులు సోమవారం పవర్ కట్ చేసినట్టు తెలిసింది. పవర్ లేని సచివాలయంలోని సిబ్బంది విధులు నిర్వహించాల్సి వచ్చింది.

భారీగా మద్యం సీసాలు స్వాధీనం


పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

పరవాడ, ఏప్రిల్ 1: సబ్బవరం మండలం అమృతపురం గ్రామానికి చెందిన గండి సత్తిబాబు సోమవారం లంకెలపాలెం ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 90 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకువెళ్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ బాలసూర్యారావు సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఎస్.రాయవరం మండలంలో...

ఎస్.రాయవరం: మండలంలోని గుడివాడ నుంచి దార్లపూడి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, 75 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. దార్లపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 75 మద్యం బాటిళ్లతో సోమవారం వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతనిని అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అనకాపల్లి పట్టణంలో..

అనకాపల్లి టౌన్: పట్టణంలో పోలీసులు సోమవారం తనిఖీలు చేసి ఇద్దరి నుంచి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట గ్రామానికి చెందిన కోనంగి రమేశ్ 12 మద్యం బాటిళ్ల పట్టణంలో కొనుగోలు చేసి వెళుతుండగా శారదానగర్‌లో తనిఖీలు చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే కశింకోట మండలం ఏఎస్ పేటకు చెందిన శ్రీధరాల వీరయ్యశెట్టి 10 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా రింగురోడ్డులో అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కోటవురట్ల మండలంలో...

కోటవురట్ల : మండలంలోని పాతగొట్టివాడలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై సోమవారం దాడిచేసి నలభై మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన అప్పికొండల అప్పలనాయుడు ఇంట్లోనే బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఎలమంచిలిలో పందులు,కోతులు స్వైరవిహారం

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసులు
- పట్టించుకోని మునిసిపల్ యంత్రాంగం


కొత్తపేటకాలనీలో సంచరిస్తున్న పందులు


మిలట్రీ కాలనీలో ఇంటి గేటుపై ఉన్న వానరాలు

ఎలమంచిలి, ఏప్రిల్ 1: పట్టణంలో ఓ వైపు వానరాల దండు.. మరోవైపు పందుల సంచారం పట్టణవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేయిస్తున్నాయి. వీధిలోకి వస్తే ఏ మూల నుంచి వానరాలు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే పందుల సంచారం పెరగడంతో ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని పట్టణ వాసులు భీతిల్లుతున్నారు. అయితే మునిసిపల్ అధికారులు, పాలకులకు ఇవేమీ పట్టడం లేదు. కోతులను పట్టించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాలని మునిసిపల్ కౌన్సిల్‌లో ప్రస్తావించినా కార్యరూపం దాల్చలేదు. దీంతో వానరాలు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి సైతం దూసుకువచ్చి తినుబండారాలను పట్టుకుపోవడం, అడ్డుకుంటే మీద పడి దాడి చేయడం చేస్తున్నాయి. దీంతో వానర దండును చూస్తే ప్రజలు భయపడుతున్నారు. పట్టణంలోని నివాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీధుల్లో సైతం రోడ్లపై పరుగులు తీస్తున్న సమయంలో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా కొత్తపేట, మిలట్రీకాలనీ, ధర్మవరం, నాగేంద్రకాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, కాకివాని వీధి వంటి ప్రాంతాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. పట్టణంలోని ఖాళీ స్థలాలు పందుల ఆవాస ప్రాంతాలుగా మారాయి.గృహనివాసాలు చెంతనే పందుల సంచరిస్తుండడంతో వీటి కారణంగా తామెక్కడ అనారోగ్యానికి గురవుతామోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని, పందుల సంచారం లేకుండా చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఏఎంఏఎ హైస్కూల్‌లో ప్రారంభమైన టెన్త్ మూల్యాంకనం


ఏఎంఏఎ హైస్కూలులో పర్యవేక్షిస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

కొత్తూరు, ఏప్రిల్ 1: స్థానిక ఏఎంఏఎ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. అనకాపల్లికి పలు జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష జవాబు పత్రాలను మూడు కేంద్రాలను ఏర్పాటు చేసి మూల్యాంకనం చేస్తున్నారు. ఈ మూల్యాంకనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ, సహాయ సంచాలకులు ఆడారి రవిబాబు, ఏఎంఓ వెంకటేశ్వరరావు, పరవాడ ఎంఈవో సాంబ శైలజ, ప్రధానోపాధ్యాయురాలు కోరిబిల్లి లావణ్య పర్యవేక్షిస్తున్నారు. ఏఎంఏఎ హైస్కూల్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సాంఘికశాస్త్రం, సైన్స్ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి గవరపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ జవాబు పత్రాలను మూల్యాంకనం జరుగుతోంది. అచ్యుతాపురం ఎంఈవో దేవరాయలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంగ్లం, గణితం జవాబు పత్రాలు మూల్యాకనం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అంతకుముందు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ సమావేశం జరిగింది. మూల్యాంకనం విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయుల సమస్యలు, సదుపాయాలతోపాటు ఇతర సమస్యలపై చర్చించినట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, చిరికి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నూకరాజు పాల్గొన్నారు.


సత్యవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వి.అనిత

రాష్ట్రంలో దుర్మార్గ పాలన : అనిత

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతుందని టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, సత్యవరం, పాల్తేరు గ్రామాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పెదరాంభద్రపురం, సత్యవరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలో పెదరాంభద్రపురం, పాల్తేరు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత సమక్షంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, బీజేపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు వేముల వెంకటేశ్వరరావు, ఎగదాసు నానాజీ పాల్గొన్నారు.

ప్రగడకు తెలియకుండా టీడీపీ ఆత్మీయ సమావేశం

- అసంతృప్తి వ్యక్తం చేసిన తెలుగు తమ్ముళ్లు
- ప్రగడతో చర్చలు జరిపిన టీడీపీ నాయకులు
- సముదాయించిన బుద్ద జగదీశ్, ప్రగడ నాగేశ్వరరావు
- జనసేన నేతలు అందరినీ కలుపుకోవడం లేదని ఆరోపణలు


తమ్ముళ్లను సముదాయిస్తున్న బుద్ద నాగజగదీశ్, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, మార్చి 1: పట్టణంలోని పాత సినిమాహాలు సమీపంలో సోమవారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు తెలియకుండా నిర్వహించడం ఏమిటని నాయకులు, కార్యకర్తలు అధినాయకులను ప్రశ్నించారు. ఈ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీష్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీ అభ్యర్థి సీఎం రాజేష్ హాజరయ్యారు. వేదికపై ప్రగడ నాగేశ్వరరావు లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేశారు. జనసేన నాయకులు అందరినీ కలుపుపోవడం లేదని పలువురు ఆరోపించారు. అనంతరం అధినాయకులంతా కలిసి టీడీపీ కార్యాలయంలో ఉన్న ప్రగడ నాగేశ్వరరావు వద్దకు అధినాయకులు వెళ్లి ఆయన చర్చించారు. తర్వాత ఆత్మీయ సమావేశానికి ప్రగడను తీసుకువెళ్లారు. నాగజగదీష్, ప్రగడ నాగేశ్వరరావు నాయకులు, కార్యకర్తలను సముదాయించడంతో అంతా సద్దుమణిగింది. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని, మరోసారి నిర్వహిస్తామని ప్రగడ చెప్పడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దూళి రంగనాయకులు, కొలుకులూరి విజయ్‌బాబు, కాండ్రకోట చిరంజీవి, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ముఖ్య నేతల సమావేశం : బుద్ద

పట్టణంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని ముఖ్య నేతల సమావేశం నిర్వహిస్తున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీష్ ప్రకటించారు. సోమవారం సాయంత్రంఆఆఆఆచార్జి ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు, సీఎం రాజేష్‌లతో కలిసి విలేకర్లతో బుద్ద మాట్లాడారు. ఈనెల 3వ తేదీన కూటమి పార్టీల అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

చిననర్సాపురంలో తాగునీటి సమస్య


గ్రామంలో నీటి సమస్యను వివరిస్తున్న మహిళలు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్1: మండలంలోని పెదరాంభద్రపురం చిననర్సాపురంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో కొన్ని నెలలుగా కొళాయిలు రావడం లేదని, తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని గ్రామానికి చెందిన జక్కుల రత్నం, జక్కుల లోవమ్మ, బోడపాటి లోవమ్మ, జక్కుల రమణమ్మ, చింతా సత్యవతి, బోడపాటి ధర్మరాజు, బోడపాటి చిట్టికాసులు తెలిపారు. ఈ గ్రామానికి పెదరాంభద్రపురం నుంచి పైపులైన్ ద్వారా నీరు గ్రామంలోని వాటర్ ట్యాంకులోకి చేరి కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. అయితే వాటర్ ట్యాంకులోకి నీరు పూర్తిస్థాయిలో చేరడం లేదని, నాలుగు కొళాయిలలో మాత్రమే నీరు వస్తుందని వారు తెలిపారు. కనీసం గ్రామంలో చేతిపంపులు కూడా లేవని, మంచినీరు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గ్రామంలో బోర్లు వేయాలని వారు కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామగోవిందును వివరణ కోరగా.. పెదరాంభద్రపురం పైపులైన్ ద్వారా నీరు ఫోర్సుగా రావడం లేదని, దీనివల్ల కొళాయిలలో నీరు తక్కువగా వస్తుందన్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జలజీవన్ మిషన్ పనులు పూర్తయిన తరువాత అదనపు బోరు వేస్తామన్నారని తెలిపారు.

కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల సాధన


ప్రాక్టీస్ చేస్తున్న శ్రేయాస్ అయ్యర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 1: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఆటగాళ్లు సోమవారం సాయంత్రం ముమ్మర సాధన చేశారు. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తోపాటు లోకల్ బాయ్ కేఎస్ భరత్, రింకూ సింగ్, నితీష్ రాణా, రూథర్‌ఫోర్డు, గుర్బాజ్, మనీష్ పాండే, సాల్ట్, రఘువన్షీ, వెంకటేష్ అయ్యర్, రమణదీప్‌సింగ్, అనుకుల్ రాయ్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్, హర్షిత్ రాణా, చమీర్‌లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. ఆటగాళ్లకు కోచ్ చంద్రకాంత్ పండిట్ సూచనలు చేశాడు. ఇక సీఎస్‌కేపై సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన ఆటగాళ్లు సిద్ధార్థ్ కౌల్, ఇషాంత్‌శర్మ, లలిత్ యాదవ్, సుమిత్‌కుమార్, ప్రవీణ్ దుబే, ఖలీల్ అహ్మద్, కులదీప్‌యాదవ్ తదితరులు సాధన చేశారు. కొందరు వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్ చేయగా, మరికొందరు ప్రధాన గ్రౌండ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. క్రికెటర్సును చూడడానికి అభిమానులు తరలివచ్చారు.

ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ దోపిడీ

... 5వ పేజీ తరువాయి


గ్రావెల్ తవ్వకాలు జరిపిన క్వారీని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

తతంగం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అమలాపురం, రాజయ్యపేట, డీఎల్‌పురం, చందనాడ, వేంపాడు గ్రామాల పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములు గ్రావెల్ అక్రమార్కులకు కామధేనువుగా మారాయి. రోజూ రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో అయితే పగటి పూట కూడా గ్రావెల్ తవ్వుతున్నారు. సంబంధిత శాఖల అధికారులకు నెల వారీ మామూళ్లు ఇస్తున్నామని, అందువల్లనే ఇంతవరకు తమను ఎవరూ అడ్డుకోలేదని అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు. ఒకవేళ కొత్తగా అధికారులు ఎవరైనా తనిఖీలకు వస్తే వారిని కూడా 'సంతృప్తి' పరుస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు మూలపర్రలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న క్వారీ వద్దకు వెళ్లగా, బయట వ్యక్తులుగా భావించి గ్రావెల్ మాఫియా దాడికి పాల్పడింది. ఆ తరువాత సదరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పుడు తత్వం బోధపడింది. ఐదుగురిపై కేసు నమోదు కావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లు సీజ్

కాగా ఆదివారం సాయంత్రం మండలంలోని అమలాపురం శివారు మూలపర్రలో వున్న ఏపీఐఐసీ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, వీటిని అడ్డుకున్న ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబుపై దాడి చేయడానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. సోమవారం ఉదయం నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు సీఐ చెప్పారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు


విజేతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎస్ఐ రాములమ్మ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : స్థానిక జీవీఎంసీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చైతన్య, చందు, వై.కుమార్, కృష్ణకుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు సాధించుకున్నారు. వీరికి మహిళా ఎస్ఐ రాములమ్మ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు రవినాథ్, బాబ్జీ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పరవాడ, ఏప్రిల్ 1: దేశపాత్రునిపాలెంలో సీతారామలక్ష్మణ, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కాసు అంజిరెడ్డి, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కర్రి వినోద్‌కుమార్, చుక్క రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుందరపు విజయమే లక్ష్యంగా పనిచేస్తా : గనగళ్ల

రాంబిల్లి, ఏప్రిల్ 1: జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ చైర్మన్ గనగళ్ల వివేక్ అన్నారు. సోమవారం పలువురు టీడీపీ నేతలతో కలిసి ఆయన అచ్యుతాపురంలోని సుందరపు ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సుందరపును వివేక్ సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే కన్నబాబుల దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షైలపల్లి దేముడు, చెల్లూరి రమణ, గనగళ్ల మసేనురావు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట, ఏప్రిల్ 1 : ఈ ఏడాది జరిగిన జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశ పరీక్షలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నవోదయ ప్రవేశ పరీక్షలో ఐదో తరగతి విద్యార్థులు అన్నంరెడ్డి జయంత్, కాకర పూజిత, కోనా భారతి చక్కని ప్రతిభ కనబర్చి 6వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సబ్బవరం, ఏప్రిల్ 1 : మండలంలోని 20 సచివాలయాల పరిధిలో పింఛన్లు ఈనెల 3వ తేదీ నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో ఎస్. రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి తప్పించడం జరిగిందన్నారు. మండలంలోని 8,364 మంది పింఛన్‌దార్లకు సచివాలయ కార్యదర్శి వెల్ఫేర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో 8 మంది సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ల పంపిణీపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని ఆయన కోరారు. మండలంలో 306 మంది వలంటీర్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, డివైజ్‌లు ఇప్పటికే స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వాటిని జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో షేక్ బాబూరావు ఉన్నారు.

ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయించాలి

రాంబిల్లి, ఏప్రిల్ 1 : లబ్ధిదారులకు ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వలంటీర్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందే తప్ప అధికారులతో పంపిణీ చేయవద్దని చెప్పలేదన్నారు. ఎన్నికల కమిషన్, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారులకు వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలనిఇ ఆయన కోరారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

అచ్యుతాపురం, ఏప్రిల్1: నియోజకవర్గంలో రోజురోజుకు జనసేనకు ఆదరణ పెరుగుతుందని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మునగపాక మండలం పాటిపల్లి పంచాయతీ వార్డు మెంబరు బొందల దుర్గారావు, సీనియర్ వైసీపీ నాయకులు ఆడారి గోవిందరావు, ఎల్లపు సాంబమూర్తి, గొల్లవిల్లి త్రిమూర్తులు, పోలిశెట్టి త్రిమూర్తులు, దుంగ రాజు ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు జనసేన తీర్థం తీసుకున్నారు. వీరందరికి కండువాలు కప్పి జనసేన పార్టీలోకి సుందరపు ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మునగపాక మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఏవీ సత్యనారాయణ, పల్లి రామునాయుడు, ఆడారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడి మృతి


సత్యనారాయణ

తుమ్మపాల, ఏప్రిల్ 1 : అనకాపల్లి పట్టణ రిక్షా కార్మికసంఘం మాజీ అధ్యక్షుడు కోన సత్యనారాయణ (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతదేహానికి పలువురు నివాళులు అర్పించారు.

రెండు గ్రామాల్లో జోగులు ఎన్నికల ప్రచారం

ఎస్. రాయవరం, ఏప్రిల్ 1: వైసీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సర్వసిద్ధి, ఉప్పరాపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దొంగతనాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సబ్బవరం, ఏప్రిల్ 1 : దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ పిన్నింటి రమణ సూచించారు. ఈ అంశంపై గ్రామాల్లో ఆటో పెట్టి మైక్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. విలువైన వస్తువులు, డబ్బు బ్యాంక్ లాకర్లలో భద్రపరుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో, వీధులో సంచరిస్తుంటే తమకు గానీ, 100కు గానీ సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. పట్టణాల్లో చెడ్డీ గ్యాంగులు తిరుగుతున్న సమాచారం ఉందని, ఊరు శివార్లలో ఉండే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైన అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పొద్దని సూచించారు. వాట్సాప్‌లో వచ్చిన లింకులు ఎట్టిపరిస్థితిలో క్లిక్ చేయవద్దని కోరారు.

'పేట' బీజేపీ ఇన్‌చార్జిగా పాకలపాటి రవిరాజు



పాయకరావుపేట, ఏప్రిల్ 1 : భారతీయ జనతా పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా పాకలపాటి రవిరాజు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారని రవిరాజు తెలిపారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌తోపాటు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత విజయానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

వయో వృద్ధులు కోరితే ఇంటి నుంచే ఓటు

- చోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చిన్నికృష్ణ వెల్లడి
- కొత్తకోట హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఆర్వో చిన్నికృష్ణ

రావికమతం, ఏప్రిల్ 1 : వయో వృద్ధులు (85 ఏళ్లు నిండిన) ఓటు హక్కును తమ ఇంటివద్ద నుంచి వేసుకుంటామని కోరితే అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చిన్నికృష్ణ అధికారులకు సూచించారు. మండలంలోని కొత్తకోట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు, నాయకులు ఎన్నికల నిబంధలను విధిగా పాటించాలని సూచించారు. సభలు, సమావేశాలకు ముందుగా సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అటువంటి వాటికే అనుమతులు ఇస్తామన్నారు. తహసీల్దార్ రమణారావు, ఆర్ఐ సతీష్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల సంతలో చింతపండుకు గిరాకీ

- కిలో రూ.60 పైబడి ధర పలికినా పోటీ పడిమరీ కొనుగోలు



మాడుగుల సంతకు విక్రయానికి గిరి రైతులు తెచ్చిన చింతపండు

మాడుగుల, ఏప్రిల్ 1 : చింతపండుకు ఈ ఏడాది ఆది నుంచి మంచి ధర పలుకుతోంది. సంతల్లో వారం వారం పెరుగుతుండడంతో ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతకు గిరిజన ప్రాంతాల నుంచి కావిడ్ల ద్వారా చింతపండును తీసుకు వచ్చారు. ఉదయం ఏడు గంటలకు వారంతా రాగా, అప్పటికే మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వేచి చూస్తున్న వ్యాపారులు హాట్ కేకుల్లా కొనుక్కొని వెళ్లిపోయారు. ఈ ఏడాది బొట్ట నాణ్యతగా ఉండడంతో ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు. పాడేరు మండలం దేవాపురం, సలుగు, కందులుపాలెం, ఈదులపాలెం, కక్కి వంట్లమామిడి వంటి గ్రామాల నుంచి సంతకు చింతపండును భారీగా తీసుకు వచ్చారు. సుమారు 30 నుంచి 36 కిలోల బరువు ఉండే చింతపండు కావిడి ధర రూ.రెండు వేల నుంచి రెండు వేల రెండు వందలు వరకు ధర పలకడంతో ఆయా రైతులు ఆనందంగా ఇంటికి తిరిగి వెళ్లారు.

రికార్డులు లేని బైక్‌లు, ఆటోలు సీజ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ అప్పలనాయుడు, సిబ్బంది

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 1: రికార్డులు లేని బైక్‌లు, ఆటోలను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. నేరాలను అదుపు చేయడంలో భాగంగా కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు వడ్డాది గ్రామంలో సోమవారం వేకువజాము నుంచి వాహనాల తనిఖీలు చేపట్టారు. రహదారులతో పాటు ఇళ్లకు కూడా వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలతో పాటు రెండు ఆటోలను సీజ్ చేశారు.

ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ దోపిడీ



గ్రావెల్ తవ్వకాలు జరిపిన క్వారీని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

... 5వ పేజీ తరువాయి

తతంగం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని అమలాపురం, రాజయ్యపేట, డీఎల్‌పురం, చందనాడ, వేంపాడు గ్రామాల పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములు గ్రావెల్ అక్రమార్కులకు కామధేనువుగా మారాయి. రోజూ రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో అయితే పగటి పూట కూడా గ్రావెల్ తవ్వుతున్నారు. సంబంధిత శాఖల అధికారులకు నెల వారీ మామూళ్లు ఇస్తున్నామని, అందువల్లనే ఇంతవరకు తమను ఎవరూ అడ్డకోలేదని అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు. ఒకవేళ కొత్తగా అధికారులు ఎవరైనా తనిఖీలకు వస్తే వారిని కూడా 'సంతృప్తి' పరుస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు మూలపర్రలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న క్వారీ వద్దకు వెళ్లగా, బయట వ్యక్తులుగా భావించి గ్రావెల్ మాఫియా దాడికి పాల్పడింది. ఆ తరువాత సదరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పుడు తత్వం బోధపడింది. ఐదుగురిపై కేసు నమోదు కావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లు సీజ్

కాగా ఆదివారం సాయంత్రం మండలంలోని అమలాపురం శివారు మూలపర్రలో వున్న ఏపీఐఐసీ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, వీటిని అడ్డుకున్న ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబుపై దాడి చేయడానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. సోమవారం ఉదయం నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు సీఐ చెప్పారు.

ఇంకుతున్న జలం.. జంకుతున్న జనం

- చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- పలుచోట్ల మూలకు చేరిన చేతిబోర్లు, నీటి పథకాల మోటర్లు
- వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే.. మున్ముందు ఏమిటని జనం ఆందోళన



మాడుగుల ఘాట్‌రోడ్డు సమీపంలోని కాగిత చెరువు (కాకుల చెరువు)లో అడుగంటిన నీటి నిల్వలు



చెరువు గర్భంలో నెర్రలు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 1 : వేసవి ఆరంభంలోనే ఈ ఏడాది పలుచోట్ల తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల చేతిబోర్లు, రక్షిత నీటిపథకాల మోటార్లు పాడవ్వగా, మరికొన్ని చోట్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇంకొన్నిచోట్ల చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతో చాలా మందిలో ఆందోళన మొదలైంది. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల మాడుగుల మండలంలోని చెరువుల్లో నీటి నిల్వలు పుష్కలంగా కనిపించేవి. ఆయా చెరువుల కింద ఆయుకట్టు రైతులు సైతం తమకు ఈ ఏడాది సాగునీటిని ఢోకా ఉండదని భావించేవారు. కానీ ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో రోజు రోజుకి నీటి నిల్వలు తగ్గుతున్నాయి. దీంతో పలుచోట్ల చెరువు భూగర్భం బీటలు వారి కనిపిస్తోంది. మాడుగుల మండలంలో చిన్నా,పెద్దా కలిపి సుమారు 67 వరకు చెరువులు ఉన్నాయి. వంద ఎకరాలు పైబడిన చెరువులు ఏడు ఉండగా, మిగిలినవి 50 ఎకరాల ఆయుకట్టులోపు చెరువులు. వీటిలో క్రమేపీ నీటి నిల్వలు తగ్గుతుండడం ఇటు అన్నదాతల్లోనూ, అటు ఆయా ప్రాంతాల ప్రజల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. వేసవి పూర్తిగా రాక ముందే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఎలా అని అంటున్నారు. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి ముందస్తుగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని, మూలకు చేరిన బోర్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపండి : అయ్యన్న



కొత్తమల్లంపేటలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, ఏప్రిల్ 1 : సంక్షేమ పథకాల్లో దోపిడీ చేయడంతో పాటు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసగించిన సీఎం జగన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఓడించి ఇంటికి పంపించాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. కొత్తమల్లంపేటలో సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రం మళ్లీ ప్రగతి సాధించాలంటే ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గెడ్డం నానాజీ, చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జి, గెడ్డం ఆనంద్, రాజాన వీరసూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో పలువురి చేరిక

కె.కోటపాడు, ఏప్రిల్ 1 : మండలంలోని కింతాడ పంచాయతీ గొల్లలపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు సమక్షంలో వైసీపీ నుంచి 30 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరందరికీ పైలా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ విజయమే ధ్యేయంగా పనిచేస్తామని వారంతా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, నాయకులు రొంగలి మహేష్, కన్నూరు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు బత్తి రమణ, బండారు నరసింహనాయుడు, పూడి నారాయణమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పైలా' ప్రచారం



మారేపల్లిలో ప్రచారం చేస్తున్న పైలా ప్రసాదరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని మారేపల్లి, తిమిరాం గ్రామాల్లో మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు సోమవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీని ఈ ఎన్నికల్లో గెలిపించాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ నెల నాలుగో తేదీన జయహో బీసీ కార్యక్రమం నాగయ్యపేటలో నిర్వహించనున్నట్టు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు పోతల పాత్రునాయుడు, చెరకాన సూర్యనారాయణ, కిల్లి గోవింద, నానాజీ, రాయపురెడ్డి కృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : సీఎం జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల వల్లే అటు పింఛనర్లు, ఇటు వలంటీర్లు, ప్రజలు నష్టపోతున్నారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. సోమవారం పోతనపూడి అగ్రహారంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయిందన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధిసాధ్యమని వివరించారు.

జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయం తథ్యం

- టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు తాతయ్యబాబు

చోడవరం, ఏప్రిల్ 1 : జిల్లాలో అనకాపల్లి ఎంపీ సీటుతో సహా ఎమ్మెల్యే స్థానాలన్నీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవడం తథ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బత్తుల తాతయ్యబాబు, ఈర్లె శ్రీరామమూర్తి, గూనూరు మల్లునాయుడు తదితరులు స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ విలేకరులతో వారు మాట్లాడుతూ సీఎం రమేశ్ రూపంలో జిల్లాకు ప్రధానమంత్రి మోదీ వద్ద పలుకుబడి కలిగిన నేత ఎంపీ అభ్యర్థిగా రావడం అందరికీ శుభపరిణామంగా పేర్కొన్నారు. సీఎం రమేశ్ విజయం సాధిస్తే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటై ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. జిల్లాకు కేంద్ర నిధులు భారీగా తీసుకు రావడంతో పాటు, షుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందన్నారు. చోడవరంలో కూటమి అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు గెలుపు ఖాయమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పెదబాబు, ఆయా పార్టీల నాయకులు బొడ్డేడ గంగాధర్, కర్రి కోటేశ్వరరావు, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, సాయిరాం, నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టకుంటే ఆందోళన

- టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి రాజు హెచ్చరిక



కొత్తకోటలో మాట్లాడుతున్న రాజు

రావికమతం/రోలుగుంట, ఏప్రిల్ 1 : పింఛన్లను మంగళవారం నుంచి ఇంటింటికీ పంపిణీ చేయకుంటే టీడీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు హెచ్చరించారు. కొత్తకోటలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి ఇంటి వద్ద సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ అనుయాయులైన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల కోసం ఖజానా సొమ్ము ఖాళీ చేసి, పింఛన్ల పంపిణీని నిలిపివేశారని ఆరోపించారు. టీడీపీ, బీజేపీ నాయకులు కోట నీలవేణి, కోట గోవిందరావు, రాజాన కొండనాయుడు, గూటాల చిన్న, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు. ఇదిలావుంటే, రోలుగుంట మండలం కొవ్వూరు, కె.నాయుడుపాలెం, నిందుగొండ, కంచుగుమ్మల, కొండపాలెం గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజు ప్రచారాన్ని నిర్వహించారు. కొండపాలెంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. నాయకులు గుములూరు చంద్రమౌళి, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



మృతి చెందిన దుర్గాలు

కె.కోటపాడు, ఏప్రిల్ 1 : కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇక్కడ చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. మండలంలోని కె.సంతపాలెం గ్రామానికి చెందిన అనపర్తి దుర్గాలు (43) గత కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి విపరీతమైన కడుపునొప్పి రావడంతో అది భరించలేక పురుగుల మందు తాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. ప్రాథమిక చికిత్సల అనంతరం అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. ఇతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దేవుడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ నాతవరం మండల అధ్యక్షుడిగా రాంబాబు



నియామక పత్రం అందుకుంటున్న రాంబాబు

నాతవరం, ఏప్రిల్ 1 : బీజేపీ నాతవరం మండల అధ్యక్షుడిగా ఎంబీపట్నం గ్రామానికి చెందిన చుక్కల రాంబాబు నియామకమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వర ఆదేశాల మేరకు నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ తమరాన ఎర్రన్నాయుడు నియమక పత్రాన్ని అందజేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి, కూటమి అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేస్తానని రాంబాబు విలేకరులకు తెలిపారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు లాలం వెంకటరమణ,గవిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.

19 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

చోడవరం, ఏప్రిల్ 1 : అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పూర్ణా థియేటర్ సమీపంలో దూది సన్యాసిరావు అనే వ్యక్తి నుంచి పదిహేను మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే ఇక్కడి చీడికాడ రోడ్డులోని సిరసపల్లి సురేష్ పాన్ షాప్ వద్ద అక్రమంగా ఉంచిన నాలుగు మద్యం బాటిళ్లు సీజ్ చేసి అతనిపై కేసు న మోదు చేసినట్టు చెప్పారు. అనంతరం నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

దివ్యాంగులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ

మాకవరపాలెం, ఏప్రిల్ 1 : దివ్యాంగుల కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని దివ్యాంగులకు కంప్యూటర్ విద్యలో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు సతీష్ సోమవారం ఇక్కడ తెలిపారు. నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాల్లో ఉన్న దివ్యాంగులకు మాకవరపాలెం మండలంలో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎమ్మెస్ ఆఫీస్, తెలుగు, ఇంగ్లీష్ టైప్ రైటింగ్ వంటి కోర్సులలో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 99519 38520 నంబరులో సంప్రదించాలన్నారు.

'అభివృద్ధిని చూసి ఓట్లు వేయండి'

మాడుగుల/ బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 1 : మాడుగుల నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లో అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, మాడుగుల ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కుమార్తె అనూరాధను గెలిపించాల్సిందిగా బూడి ముత్యాలనాయుడు కోరారు. సోమవారం మాడుగులలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాడుగుల అభ్యర్థిని అనూరాధ, జడ్పీటీసీ కిముడు రమణమ్మ, నాయకులు తాళ్లపురెడ్డి రాజారాం, వేమవరపు రామధర్మజ, శ్రీను, కొండలరావు, సంజీవ్ పాల్గొన్నారు. అలాగే, బుచ్చెయ్యపేట మండలం చినప్పన్నపాలెంలో జరిగిన వైసీపీ మండల స్థాయి సమావేశంలో ముత్యాలనాయుడు మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, నాయకులు వెంకటేశ్వరరావు, జోగా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాదాలను పక్కనపెట్టండి : ఎమ్మెల్యే గణేశ్

గొలుగొండ, ఏప్రిల్ 1 : పాతకృష్ణాదేవిపేటలో వైసీపీ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి పంచాయతీలో చలివేంద్రం'



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, ఏప్రిల్ 1 : ఎండల తీవ్రత దృష్ట్యా జనాలు ఎక్కువగా ఉండేచోట ప్రతి పంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో జె.రాంబాబు కార్యదర్శులకు సూచించారు. నాతవరంలోని బస్‌స్టాండ్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటైన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. దాతలు ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాల్సిందిగా ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి బి.రమేష్, ఈవోపీఆర్డీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

4న రోలుగుంట మండల సమావేశం

రోలుగుంట, ఏప్రిల్ 1 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో రోలుగుంట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల నాలుగో తేదీన జరగనుంది. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో కె.జాన్‌లింకన్ కోరారు.

పైడితల్లమ్మ ఆలయానికి విరాళం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 1 : పోతనపూడి అగ్రహారంలో నూతనంగా నిర్మించిన పైడితల్లమ్మ ఆలయం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు రూ.20 వేలను విరాళంగా అందజేశారు. సోమవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్న అనంతరం విరాళాన్ని ఆయల కమిటీకి అందించారు. ఈ కార్యక్రమంలో సాంబమూర్తి, వెంకటరమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

పది లీటర్ల నాటు సారా స్వాధీనం

నర్సీపట్నం, ఏప్రిల్ 1 : రోలుగుంట మండలం బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన ఉలబల రమణబాబు వద్ద నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకుని నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు. అలాగే, అదే మండలంలో నాలుగు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

అనకాపల్లి, ఏప్రిల్ 1: కొత్తూరు ఏఎంఏఎ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. అనకాపల్లికి పలు జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష జవాబు పత్రాలను మూడు కేంద్రాలను ఏర్పాటు చేసి మూల్యాంకనం చేస్తున్నారు. ఈ మూల్యాంకనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ, సహాయ సంచాలకులు ఆడారి రవిబాబు, ఏఎంఏ వెంకటేశ్వరరావు, పరవాడ ఎంఈవో సాంబ శైలజ, ప్రధానోపాధ్యాయురాలు కోరిబిల్లి లావణ్య పర్యవేక్షిస్తున్నారు. ఏఎంఏఎ హైస్కూల్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సాంఘికశాస్త్రం, సైన్స్ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి గవరపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ జవాబు పత్రాలను మూల్యాంకనం జరుగుతోంది. అచ్యుతాపురం ఎంఈవో దేవరాయలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంగ్లం, గణితం జవాబు పత్రాలు మూల్యాకనం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

- పక్కకు తొలగించాల్సిందిగా గురందొరపాలెం వాసులు విజ్ఞప్తి



గ్రామంలో రోడ్డు మధ ఉన్న స్తంభం

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 1 : అభివృద్ధి పనులు చేసేటప్పుడు కనీస ఆలోచన లేకుండా పలువురు అధికారులు వ్యవహరిస్తుండడంతో ఆయా ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఇదే దుస్థితి మండలంలోని గురందొరపాలెంలో నెలకొంది. ఈ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గతంలో విద్యుత్ స్తంభం ఉండేది. దీనికి వీధి లైటు ఏర్పాటు చేయడంతో అందరికీ సౌకర్యవంతంగా ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా కాలనీకి సిమెంటు రోడ్డు మంజూరైంది. స్తంభం ఉన్న చోట అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ స్తంభం రోడ్డు మధ్యలో ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతు భరోసా కేంద్రానికి సమీపంలో ఇది ఉండడంతో ఇక్కడికి వచ్చే వాహనదారులతో పాటు చెత్తను తొలగించేందుకు వచ్చే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో స్తంభాన్ని రోడ్డు పక్కకు మార్చాలని పలుమార్లు కోరుతున్నా ఫలితం లేకపోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనికితోడు వర్షాలు కురిసే సమయాల్లో విద్యుత్ స్తంభం ఉండడం వల్ల ఇటుగా రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నట్టు పలువురు చెపుతున్నారు. ఈ సమస్యలపై అధికారులు స్పందించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల సాధన



ప్రాక్టీస్ చేస్తున్న శ్రేయాస్ అయ్యర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 1 : నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఆటగాళ్లు సోమవారం సాయంత్రం ముమ్మర సాధన చేశారు. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తోపాటు లోకల్ బాయ్ కేఎస్ భరత్, రింకూ సింగ్, నితీష్ రాణా, రూథర్‌ఫోర్డు, గుర్బాజ్, మనీష్ పాండే, సాల్ట్, రఘువన్షీ, వెంకటేష్ అయ్యర్, రమణదీప్‌సింగ్, అనుకుల్ రాయ్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్, హర్షిత్ రాణా, చమీర్‌లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. ఆటగాళ్లకు కోచ్ చంద్రకాంత్ పండిట్ సూచనలు చేశాడు. ఇక సీఎస్‌కేపై సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన ఆటగాళ్లు సిద్ధార్థ్ కౌల్, ఇషాంత్‌శర్మ, లలిత్ యాదవ్, సుమిత్‌కుమార్, ప్రవీణ్ దుబే, ఖలీల్ అహ్మద్, కులదీప్‌యాదవ్ తదితరులు సాధన చేశారు. కొందరు వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్ చేయగా, మరికొందరు ప్రధాన గ్రౌండ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు.